

# సత్యవాక్కు

సంపుటి - 42 జూలై - 2021 సంచిక - 12

JULY 2'

## క్రైస్తవ మాసపత్రిక

**జూలై - 2021**

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో

శనివారం ఉదయం : 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో

ప్రతిరోజు ఉదయం : 7.30 ని॥లకు కాంతి ఛానల్‌లో

ప్రతిరోజు మధ్యాహ్నం : 3.30 ని॥లకు కాంతి ఛానల్‌లో

ప్రసంగీకులు : జాషువా గూటం

లిక్కీ గూటం

రోసీ గూటం

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

### జూలై విషయ సూచిక


1. దేవునితో నడిచిన హనోకు - పేజీ 3
2. ఇద్దరు స్త్రీలు, రెండు ధర్మశాస్త్రములు - 8
3. సమరయులు - 12
4. పరిశుద్ధులతో కలసి ఆరాధించుట - 17
5. సత్యమును గూర్చి మానవుని భక్తి గల శ్రద్ధ - 19



**SATYAVANI**

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. PH : 0884-2363722

98489 98547, www.satyavanivcoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్: జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 జూలై- 2021 సంచిక -12


## దేవునితో నడిచిన హనోకు

బైబిలు గ్రంధములో కనబడు ఘనులలో హనోకు ఒకడు. అతని గూర్చి బైబిలులో అనేకసార్లు చెప్పబడ లేదు గాని, చెప్పబడిన కొద్దిచోట్ల ఆసక్తిని కలిగించు విషయములు చెప్పబడెను. అతడు సత్ప్రవర్తన కలిగిన పురుషుడు. అతని మాదిరి ననుసరించుట మనకు చాల మేలు.

హనోకును గూర్చి బైబిలునందు చెప్పబడిన మూడు సందర్భములను ఇప్పుడు మనము చూద్దాం. మొదటిది అది. 5:21-24లో మోషేచే వ్రాయ బడెను: "హనోకు అరువదియేండ్లు బ్రదికి మెతూషెలను కనెను. హనోకు మెతూషెలను కనిన తరువాత మూడు వందల యేండ్లు దేవునితో నడుచుచు కుమారులను కుమార్తెలను కనెను. హనోకు దినములన్నియు మూడు వందల అరువది యైదేండ్లు. హనోకు దేవునితో నడచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను గనుక అతడు లేక పోయెను". రెండవదిగా హనోకును గూర్చి హెబ్రీ 11:5లో మనము చూడ గలము: "విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపో బడెను; అతడు కొనిపోబడకమునుపు దేవునికిష్టుడై యుండెనని సాక్ష్యము పొందెను; కాగా దేవుడతని

కొనిపోయెను గనుక అతడు కనబడ లేదు". మూడవదిగా యూదా వ్రాసిన పత్రిక 14, 15 వచనములలో హానోకును గూర్చి వ్రాయబడి యుండుట మనము చూడగలము : "ఆదాము మొదలుకొని యేడవవాడైన హానోకు కూడ వీరిని గూర్చి ప్రవచించి యిట్లనెను – ఇదిగో తీర్పు తీర్చుటకును, వారిలో భక్తిహీనులందరును భక్తిహీన ముగా చేసినవారి భక్తిహీన క్రియలన్నిటిని గూర్చియు, భక్తిహీనులైన పాపులు తనకు విరోధముగా చెప్పిన కఠినమైన మాటలన్నిటిని గూర్చియు వారిని ఒప్పించుటకును ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను".

హానోకు పాతనిబంధన కాలపు చరిత్రలో పితరుల యుగములో నివసించెను. యెహోవా దేవుని చిత్తము ఆ కాలములో కొంతమట్టుకే బయలు పరచబడినందున అది నక్షత్ర కాంతి యుగముగా పోల్చబడెను. అయితే హానోకును గూర్చి మనము మొదట గమనించేది యేమంటే, అతడు ప్రతి దినము దేవునితో నడిచెనను నట్టిది. అతడు దేవునితో నడుచుచూ కుమారులను కుమార్తెలను కనెను; అతడు దేవునితో నడచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను అని మోషే వ్రాసెను.

శ్రేష్ఠమైన మిత్రుని యెంచు కొనుట హానోకు ఎరుగును. దేవుని మించిన మంచిమిత్రుడు మానవునికి మరెవడును లేడు. యెహోవా దేవుడు హానోకుతోవలె మరెవరితోను స్నేహించలేదు. దేవుని సన్నిధిలో కాలము గడుపుటకు హానోకు ఆనందించెను. అట్లు కాని యెడల అతడు మూడువందల యేండ్లు గడప లేక పోయెడివాడు. అతడు దేవునితో నడిచిన కాలము తాత్కాలికమైనది కాదు గాని ఈ జీవితం తరువాత మరో జీవితంలోనికి కూడ కొనసాగినట్టి ప్రయాణమై యుండెను. అతడు చనిపోయేవరకు దేవునితో నడిచెననుట సమంజసము కాదు, ఎందువలనంటే హానోకు చనిపోలేదు. అతడు దేవునితో కొంతమట్టుకు నడిచి ఈలోకసంబంధ మైన శోధనలు రాగా ఆయనను విడిచి

పెట్టిన మనుష్యుడుకాదు. హానోకు దృఢ విశ్వాసముగల వ్యక్తి; గాలి యెటు వీస్తే అటువీచే వ్యక్తిత్వము అతనికి లేదు. పేరుమట్టుకే అతడు యెహోవాతో సంబంధము గలవాడు కాదు, దేవునితో అతనికి గల సంబంధము చలింపనిది.

హానోకు దేవునితో నడిచెను అనగా దేవుడు వెళ్ళేత్రోవలోనే అతడును వెళ్ళెనని మనము గ్రహించు కొనగలము. ప్రవక్తయైన ఆమోసు, "సమ్మతింపకుండ ఇద్దరు కూడి నడుతురా?" యని తన ప్రజలను ప్రశ్నించెను (ఆమోసు 3:3). హానోకు దేవునితోను, దేవుడు హానోకుతోను సమ్మతించిరి గనుక వారిద్దరు కలసి నడువగలిగిరి.

హానోకు తన పిల్లల యెదుట నడిచెను, హానోకు తన 65వ యేట మెతూషెలను కనెను. ఈ కుమారుడు పుట్టకముందతడు దేవునితో నడిచెనో లేదో మనకు ఖచ్చితముగా తెలియదు గాని తన కుమారుడైన మెతూషెల యెదుటను తరువాత కలిగిన కుమారులు కుమార్తెల యెదుటను హానోకు దేవునితో మూడువందల యేండ్లు నడిచెననుటలో సందేహమేమి యును లేదు. హానోకు పిల్లలు తమ తండ్రి, తండ్రియైన దేవునితో నడువని ఒక్కరోజును కూడ ఎరుగరు. అతని మనస్తత్వమును బట్టి, నోటిమాటలను బట్టి, జీవితధ్యేయమును బట్టి వారు దానిని గూర్చి చెప్పగలరు. తన తండ్రి కొనిపోబడిన తరువాత మెతూషెల 669 యేండ్లు బ్రదికెను. ఈ దినము లన్నిటిలోను దేవునితో నడిచిన తన తండ్రి యొక్క జీవితమును జ్ఞప్తిలో యుంచుకొని అతడు జీవించెను. నేటి తలిదండ్రులు తమ పిల్లల యెదుట హానోకువలె దేవునితో నడుచుచున్నారా? మా తండ్రి ప్రతిదినము దేవునితో నడుచుచున్నాడని మనబిడ్డలు మనలను గూర్చి చెప్ప గలుగుదురా? కాని యెడల ఎందుకు చెప్పలేరు? ఈ జీవితయాత్ర ముగింపయిన తరువాత నీ బిడ్డలు వారికి కలిగిన క్రైస్తవ

తండ్రిని గూర్చి దేవుని స్తుతించగలరా? నీవు దేవునితో నడుచుకొన్న వ్యక్తివని వారు ఆనందించగలరా? బిడ్డలకు ఇట్టి పవిత్రహక్కును ఈయగలిగినవారు తలి దండ్రులే యని మీరు గమనించ గోర్తాను.

తరువాత, హనోకు దేవునికి ఇష్టుడై యుండెనని మనము గమనించ గలము. అతడు దేవునితో నడుచుటకు ఇష్టపడెను. అల్లే భూమిపై తన నమ్మక మైన దాసునితో నడుచుటకు దేవుని కిష్టమాయెను. దేవునికిని హనోకుకును మధ్య పరస్పర ప్రేమ అధికముగా యుండెను. అందువలన వారిద్దరు విడువక దీర్ఘకాలము నడువగల్గిరి.

హనోకు కాలములోనే దేవుడు తన ప్రజలకొక నివాసమును కలుగ జేయుచున్నట్లు తెలియజేసెను. హనోకు మరణము చూడకయే దేవునిచే కొనిపోబడినందున ఆ సంఘటన నెరిగిన తన ప్రజలందరి హృదయము లలో అది నాటుకొనిపోయెను. పితరుల యుగములో జరిగిన ఈ సంఘటన మానవులకు ఈ భౌతిక ప్రపంచముగాక వేరొక నివాస స్థలమును దేవుడేర్పరచెనని నిర్ధారణ చేసెను.

తరువాత, హనోకు ఒక ప్రవక్త యని మనము గమనించగలము. అతడు దేవుని యొక్క తీవ్రతను గూర్చి హెచ్చరించెను. భక్తిహీనులైన పాపులు పలుకు భక్తిహీన మాటలను, చేసిన భక్తిహీనక్రియలను దేవుడు సహించడు. పాపమునకు జీతము లభించే దిన మొకటి యున్నదని హనోకు ఎరుగును. అందును బట్టి తన ప్రజల నడతను హెచ్చరించెను. మనుష్యులు పలుకు ప్రతిమాటను బట్టియు, చేయు ప్రతి తలంపును బట్టియు, క్రియలను బట్టియు దేవుడు వారిని తీర్పులోనికి తెచ్చునని నీవెరుగవా? నీవు దిన దినము దేవునితో నడుచుచున్నవాడ వయితే ఈ సంగతిని తప్పక ఎరుగుదువు. దేవునితో నీవు నడుచుట లేనియెడల ఈరోజునుండే ఆయనతో నడుచుటకు నిశ్చయించుకో.

నీవు దేవునితో నడువవలెనన్న ఆయన కుమారుని మాటలను

వినవలెను. "ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన మాటలు వినుడి" అని ఆయన యేసునుగూర్చి పలికెను (మత్తయి 17:5). యేసు యొక్క దైవత్వమునందు నీవు విశ్వసించ వలెను (యోహాను 8:21, 24; మత్తయి 16:16). ఆయన మాటలను వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17). నీవు నీ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను. లేనియెడల నీవు నశింతువు (లూకా 13:3, 5). యేసే ప్రభువని నీకున్న విశ్వాసమును మనుష్యుల యెదుట నీవు ఒప్పుకొనవలెను. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయ ములో విశ్వసించును, రక్షణ కలుగు నట్లు నోటితో ఒప్పుకొనును (రోమా 10:9,10). ప్రభువు నిన్ను తన సంఘ ముతో చేర్చునట్లును, నీ పాపములు క్షమింపబడునట్లును ప్రభువు నామమున నీటిలో ముంచడము పొందవలెను(అపొ. కా. 2:38). అప్పుడు ప్రభువు నీవాడును, నీవాయన వాడవును అగుదువు. అయితే దేవునితో నడుచుచు నీవు ముందుకు సాగునట్లు దేవుని వాక్యమునందును, ఆరాధనలోను నీవు నమ్మకముగా జీవించవలెను. ఆయన రాకకై ఆసక్తితో ఎదురు చూచుచుండ వలెను.

పితరుల యుగములో హానోకు దేవునితో నడిచినట్లు క్రైస్తవయుగములో ఆయనతో నడిచినవారు హానోకువలె నిత్యానందములో ప్రవేశింతురు. ఈ జీవితములో దేవునితో నడుచుటకు నిరాకరించువారు ఈ జీవితానంతరము యెల్లప్పుడు బాధింపబడు నరకములో ప్రవేశింతురు. అక్కడ యేడ్పును పండ్లు కొరుకుటయు ఉండును.

మిత్రుడా, నీవు యెవరితో నడుచుచున్నావు? దేవునితోనా లేక అపవాదితోనా? ఒక్కసారి నీ జీవిత మును పరిశీలించుకో. దేవుని మార్గములో ప్రవేశించి ఆయనతో నడువవలెనని కోరుచున్న యెడల ఈరోజే మీకు దగ్గిరగా యున్న క్రీస్తు సంఘమును దర్శించండి. లేదా మీ కోరికను మాకు తెలియజేయండి.

క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి (రోమా 16:16).

# ఇద్దరు స్త్రీలు - రెండు ధర్మశాస్త్రములు

రెండు నిబంధనలను గూర్చి పూర్తిగా వివరించుటకు గాను అపో. పౌలు గలతీ 4:21-31లో ఇద్దరు స్త్రీలను అనగా శారాను, హాగరును ఉదాహరణగా వినియోగించాడు. నిబంధనల సంబంధమును మనము అర్థము చేసికొనునట్లు ఈ ఉదాహరణను ఈ పాఠములో మరికొంత పరిశీలింతము.

మొదటిగా మనము సందర్భమును గ్రహించుకోవాలి. గలతీయులకు వ్రాయబడిన పత్రిక ముఖ్యముగా యూదులలో నుండి క్రైస్తవులయిన వారికి వ్రాయబడెను. వారు మరల పాత ఆచారములకు, నిబంధనకు మరలిపోవుటకు యత్నించు చుండిరి. అబ్రాహాము యొక్క సంతతి మేమని యూదులు గర్వించేవారు. అందువలన దేవుని యొక్క వాగ్దానములు, ఆశీర్వాదములు తమవేయని వారు తలంచేవారు. గనుక అబ్రాహాముకు ఇద్దరు కుమారులుండిరని పౌలు వారికి జ్ఞప్తి చేసాడు. ఒకడేమో వాగ్దాన పుత్రుడయితే రెండవ వాడు అతని దాసి యొుక్క కుమారుడు. ఒకనికి ఆశీర్వాదము లియ్యబడెను. రెండవ వానికి ఇయ్యబడలేదు. గనుక అబ్రాహాముకు భౌతికంగా జన్మించిన వారమని చెప్పుకొంటే ఆశీర్వాదములు పొందుదుమనే నిర్ధారణ యేమీ లేదు. ఈ ఉదాహరణలో ధర్మశాస్త్రమీయబడిన సీనాయి పర్వతము హాగరుకు గురుతుగా యుంటే, ఆమె కుమారుడైన ఇష్మాయేలు ఇశ్రాయేలు జనాంగముకు గురుతుగా యుండెను. వారికి యెరూషలేము కేంద్రముగాను, ఆరాధన స్థలముగాను యుండెను. శారా అయితే క్రొత్త నిబంధనకు గురుతుగా యున్నది. అది కల్వరి కొండకు ఇస్సాకుకు గురుతుగా యున్నది. విశ్వాసము ద్వారా క్రీస్తులో యున్న ప్రతివాడు ఆ నూతన నిబంధనలో సభ్యులవుదురు.

**జననము**

సహజ పరిస్థితులలోనే ఇష్మాయేలు జన్మించెను. దేవునిశక్తి పై ఆధారపడకుండా అబ్రాహాము దేవుడు తన వాగ్దానమును నెరవేర్చుటకు ఆయనకు సహాయ పడగోరినందున ఇష్మాయేలు జన్మించెను. అతని జన్మతో జత గూడిన వాగ్దానములు యేమీలేవు. ఇశ్రాయేలు జనాంగము శరీర సంబంధమైన కుమారుడు. దాని ఆశీర్వాదములు ఎక్కువగా భౌతికమైనవే. ఒకడు పాతనిబంధనలోనికి భౌతికంగా జన్మించేవాడు. ఇశ్రాయేలు జనాంగములో సభ్యత్వము వంశపారంపర్యము, రక్తమాంసముల సంబంధము.

అది అట్లయితే ఇస్సాకు పర సంబంధమైన సూత్రములతో జన్మించాడు. అతని తల్లి అబ్రాహాము యొక్క భార్యయైన శారా, అతనిది కూడ సహజ జన్మయేగాని, అతడు జన్మించునట్లు దేవుడు సంకల్పించారు. దేవుడు చేసిన వాగ్దాన ఫలితముగా అతడు జన్మించాడు. అతడు విశ్వాసమూలమున జన్మించినపుత్రుడు. ఇస్సాకు యొక్క సంతతి వారు దేవుని వాగ్దానములను ఆత్మీయముగా పొందుదురు. అవన్నియు ఆత్మీయ వాగ్దానములే, రోమీయులకు వ్రాసిన పత్రికలో భౌతిక సంబంధమైన ఇశ్రాయేలుకును ఆత్మీయ సంబంధమైన ఇశ్రాయేలుకును గల వ్యత్యాసమును తెలియజేయుచున్నాడు. ఇస్సాకు ఆత్మీయ ఇశ్రాయేలుకు గురుతుగా యున్నాడు. వారు క్రొత్త జన్మద్వారా ఆత్మీయముగా తిరిగి జన్మించినవారు. "వారు దేవుని వలన పుట్టిన వారే గాని రక్తము వలననైనను శరీరేచ్ఛ వలననైనను మానుషేచ్ఛ వలననైనను పుట్టినవారు కారు" (యోహాను 1:13). నీకొదేము యేసునొద్దకు వచ్చినప్పుడు క్రొత్త జన్మను గూర్చి ఆయన అతనికి తెలియజేసారు. ఒకడు ఆత్మమూలముగాను నీటి మూలముగాను తిరిగి జన్మించవాలని యేసు చెప్పారు (యోహాను 3:3-5). గనుక పాత నిబంధన యొక్క భౌతిక జన్మకు వ్యత్యాసముగా ఈ క్రొత్త నిబంధన జన్మ ఆత్మీయమైనది.

## వారు జీవించిన పరిస్థితులు

హాగరు, ఇష్మాయేలు బానిసలు, వారు సీనాయి కొండమీద ఇయ్యబడిన పది ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమునకు గురుతుగా యున్నారు. ఈ నిబంధన తమ పితరులు సయితము మోయలేని కాడిగా వర్ణించబడెను. పాత నిబంధన ప్రకారము మనము జీవించినంత కాలము ఈ లోక పాపములకు మనము బానిసలైయుందుము.

శారా, ఇస్సాకులు స్వతంత్రులు. యెరూషలేములో ఇయ్యబడిన క్రీస్తు చట్టము (క్రొత్తనిబంధన) మనలను స్వతంత్రులనుగా చేయును. "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసి యున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి" (గలతీ 5:1). క్రీస్తులో మనము మోషే ధర్మశాస్త్రము నుండి విడుదల పొందియున్నాము. కృపను బట్టి మనం ఇప్పుడు దేవుని సేవించుటకు స్వతంత్రులమైయున్నాము. ధర్మశాస్త్రము వలన కాదు. విశ్వాసమును బట్టి కృపద్వారా ఇప్పుడు మనం రక్షింపబడి యున్నాము. పాపక్షమాపణను పొంది యున్నాము. అది ధర్మశాస్త్రమును బట్టి సాధ్యము కాలేదు. ఈ స్వాతంత్ర్యము పాపము నుండి విడుదల గాని పాపము చేయుటకు కాదు.

## ఇద్దరు కుమారులు యొక్క మనస్సు

ఇష్మాయేలుకు బానిసత్వము, హింసాగుణముండెను. ఇస్సాకు పెరుగుచుండగా ఇష్మాయేలు ఆ బాలుని హేళన చేసాడు, హింసించాడు. యిది తదుపరి ఆత్మీయ ఇశ్రాయేలు అయిన సంఘమునకు గొప్ప పాఠమై యుండెను. క్రీస్తు యొక్క సంఘమును ఎక్కువగా యూదుల జనాంగవే హింసించెను.

ఇస్సాకు బాధనొందినవాడు, వినయముగలవాడు, ఆత్మీయముగా యున్నవాడు. క్రీస్తు సంఘము స్థాపించబడిన వెంటనే యూదుల నాయకుల నుండి , పెద్దల నుండి హింస ప్రారంభ

మాయెను. అవును "క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించు వారందరు హింసపొందుదురు" (2తిమో 3:12). యూదా మతములోనికి తిరిగి ఆకర్షించు ఈ బోధకులు నిజముగా క్రైస్తవుల శత్రువులని వారు గమనించాలని పౌలు గలతీయులకు వ్రాసిన పత్రిక చెప్పుచున్నది.

### కడపటి అంతము

ఇష్మాయేలు వారసుడు కాదు. అతడు ఒక బానిసకు రావలసిన దానికి మాత్రమే అర్హుడు. ఇష్మాయేలు ఇస్సాకును హేళన చేయగా శారా దానిని చూచెను. గనుక హాగరును ఆమె కుమారుడైన ఇష్మాయేలును వెళ్ళగొట్టవలెనని శారా అబ్రాహామును ప్రోత్సహించెను. ఇష్మాయేలు ఎందుకు వెళ్ళ గొట్టబడెను? ఏలయనగా అతడు ఇస్సాకుతో సమాన వారసుడు కానేరడు. పాతనిబంధన వెళ్ళగొట్టబడెనని దీని యర్థము! ఇశ్రాయేలీయుల ఆశీర్వాదములు కానాను దేశమును స్వతంత్రించుకొను వరకు మాత్రమే. వారు కూడ నిత్యరక్షణను పొందవచ్చును. గాని పాత నిబంధన యొక్క సంకల్పము అదికాదు. పాత నిబంధనను పాటించుట ద్వారా ఎవనికిని రక్షణ కలుగదు.

వాగ్దాన పుత్రుడైన ఇస్సాకు అబ్రాహాము యొక్క ఆస్థినంతటికిని వారసుడు, యిది సంఘమునకు గురుతుగా యున్నది. "మనము పిల్లలమయితే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల క్రీస్తుతోడి వారసులము" (రోమా 8:17). క్రైస్తవులుగా మనము పాపము నుండి విడుదల చేయబడితిమి. "కాగా సహోదరులారా, మనము స్వతంత్రురాలి కుమారులమే గాని దాసి కుమారులము కాదు. ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసి యున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమును కాడిక్రింద చిక్కుకొనకుడి" (గలతీ 4:31-5:1). క్రొత్త నిబంధన అనుగ్రహించు దీవెనలలో పాపక్షమాపణ భాగమై

యున్నది. మరియు నిత్య జీవమను వాగ్దానము కూడ మనకున్నది. పాత నిబంధన చొప్పున నడువ ప్రయత్నించిన యెడల మరల దాసత్వములోనికి తిరిగిపోవుటయే.

### ముగింపు

రెండు నిబంధనలున్నవి. పాత నిబంధన మోషేద్వారా సీనాయి కొండ వద్ద ఈయబడినది; క్రొత్త నిబంధన క్రీస్తు ద్వారా ఇయ్యబడినది. అది క్రీస్తు సిలువతో ప్రతిష్టింపబడినది. పాత దాని స్థానములో క్రొత్తనిబంధన ఇప్పుడున్నది. పాత నిబంధన ప్రకారము నడుచుకొనుట కృపలో నుండి తొలగిపోవుటయే (గలతీ 5:4). ఈ రెండు నిబంధనలను మనం పాటించలేము. క్రీస్తు యొక్క పరిపూర్ణ క్రొత్త నియమముకు (యాకోబు1:25). దేనినైనా కలిపితే క్రీస్తును కించ పరచి నట్లే యగును. క్రొత్త నిబంధన వలన కలుగు ఆశీర్వాదములను పోగొట్టు కొనుట జరుగును.

–జెర్రీ బేట్స్

## సమరయులు

సమరయలను గూర్చి వినగానే యేసు చెప్పిన మంచి సమరయుని ఉపమానమును మనం తలంచుదుము. లేదా ఒక బావి దగ్గర యేసు కూర్చుండి సమరయస్త్రీతో చేసిన సంభాషణ గుర్తు తెచ్చుకొంటాము.

### రెండు రాజ్యములు

దావీదు ఏలుబడిలో యెరూషలేము యూదుల రాజ్యము యొక్క ముఖ్యపట్టణముగా యుండేది. దావీదు కుమారుడైన సొలొమోను యెరూషలేములో ఆరాధన నిమిత్తము దేవాలయమును నిర్మించెను. అయితే ఈ యూదులరాజ్యము సొలొమోను కుమారుడైన రెహబాము యొక్క కఠిన పాలన వలన క్రీ॥పూ॥922లో రెండుగా చీలిపోయెను. అతని విజ్ఞత లేని మాటవలన ఇశ్రాయేలులోని 10 గోత్రములవారు తిరుగుబాటుచేసి యరొబాము నాయకత్వమున వేరొక రాజ్యమైపోయిరి. తత్ఫలితముగా యూదులు రెండు రాజ్యములయ్యిరి.

రెహబాము పాలించిన రెండు గోత్రముల వారు దక్షిణదేశమై యూదా రాజ్యమని పిలువబడిరి. ఉత్తర భాగమునందున్న పదిగోత్రముల రాజ్యము ఇశ్రాయేలు రాజ్యమని పిలువబడేవి. సమరయులను గూర్చి తెలిసికోవాలంటే మనం మొదట ఉత్తర దేశమైన ఇశ్రాయేలు పై మన దృష్టిని కేంద్రీకరించాలి.

## సమరయ యొక్క ఆరంభము

ఉత్తరదేశమైన ఇశ్రాయేలు దేశము సాధారణముగా కొండలతో నిండియుండేది. అది యెఫ్రెయేలుకును, అయ్యాలోనుకును మధ్యనున్న ప్రదేశము. కొంతకాలము మట్టుకు, షెకెము దాని ముఖ్యపట్టణముగా నుండెను (1రాజులు 12:2). తరువాత అది తిర్సాపట్టణమునకు మార్చబడెను (1రాజులు 14:17). అక్కడ నుండి ఒమ్రీయను, ఇశ్రాయేలు యొక్క ఆరవ రాజు ఆరు సంవత్సరముల మట్టుకు పాలించెను (1రాజులు 16:15-23). తదుపరి అతడు సమరయ పట్టణమును నిర్మించెను. అది ఉత్తర దేశమునకు ముఖ్యపట్టణమయ్యెను (1రాజులు 16: 21). అది ఒక కొండపై నిర్మించబడెను. "ఒమ్రీషెమెరు నొద్ద షోమ్రోను కొండను నాలుగు మణుగుల వెండికి కొనుక్కొని ఆ కొండ యజమానుడైన షెమెరు అనునతని పేరును బట్టి తాను కట్టించిన పట్టణమునకు షోమ్రోను (సమరయ) అను పేరుపెట్టెను" (1 రాజులు 16:24).

ఈ రెండు దేశములు పరస్పర వైరుధ్యము కలిగియుండేవి. దేవుని ఆరాధించాలంటే యెరూషలేములో (యూదాదేశములో) యున్న పట్టణమునకు తప్పక వెళ్లవలెను. గనుక ఇశ్రాయేలు వారు యెరూషలేముకు వెళ్ళనవసరం లేకుండా ఉత్తర భాగమైన ఇశ్రాయేలు దేశము దానులోను, బేతేలులోను బంగారు దూడలను చేయించి అక్కడ వాటికి ఆరాధన ప్రోత్సాహించెను. ఆహాబు రాజును యెజెబెలు రాణియును ఈ విగ్రహారాధనను బహుగా ప్రోత్సహించిరి (1 రాజులు 16:12). అట్టి

అసత్యదేవుళ్లను, విగ్రహారాధనను బట్టి వాటి ఆరాధన ఖండించుటకుగాను దేవుడు ప్రవక్తలను వారి మధ్యకు పంపే వారు. ఏలియా, ఎలీషా, ఆమోసు, హోషేయ అను ప్రవక్తలు ఇశ్రాయేలులో ప్రకటించిరి. అయినను వారు విగ్రహారాధనలో కొనసాగు చున్నందున ఉత్తర ఇశ్రాయేలు దేశమును దేవుడు పడిపోజేసెను.

### ఒండొరులు మిళితమవుట

క్రీస్తుపూర్వము 7వ, 8వ శతాబ్ధములలో అష్షూరు సామ్రాజ్యము గొప్పగా వెలుగుచుండెను. అది విశాల మైనది, శక్తివంతమైనది. అది మెసపొతొమియ ఉత్తరభాగములో యుండెను. మొదట్లో దాని ముఖ్య పట్టణమైన అష్షూరు తదుపరి నీనెవగా మార్చబడెను. క్రీ॥పూ॥ 841లో ఇశ్రాయేలు దేశము అష్షూరు దేశము సమరయ పట్టణమును మూడు సంవత్సరముల మట్టుకు ముట్టడి వేయగా అది క్రీ॥పూ722లో వారి చేతికి పూర్ణముగా చిక్కెను. అష్షూరీయులు ఇశ్రాయేలు దేశములో యున్న యూదులనందరిని ఇంచు మించుగా హిద్దికెలు (బైగ్రిన్), యూఫ్రటీసు నదీప్రాంతములకు తరలించిరి. యిది పది గోత్రములతో కూడి యున్న ఇశ్రాయేలు దేశము యొక్క ఉనికికి అంతము పలికెను.

అష్షూరు దేశము అదేప్రాంతము లో నివసించుటకు గాను వారు జయించిన యితర జనాంగములను కూడ స్థిరపరచిరి. అది ఒకప్పటి ఉత్తరదేశమైన ఇశ్రాయేలు దేశము (2 రాజులు 17:24; ఎజ్రా 4:8-10; నెహెమ్యా 4:7). ఈ అన్యజనాంగముల వారు ఇశ్రాయేలు జనాంగములోయున్న వారితో పరస్పర వివాహసంబంధములు కొనసాగించుకొనిరి. అందువలన యూదా దేశములో యున్నవారు ఈ మిశ్రమ జాతివారిని అపవిత్రులుగా ఎంచేవారు. ఈ మిశ్రమ జాతియే సమరయులు.

సమరయులు పలు మత సంబంధ నమ్మకములతో మిళితమై యున్న ప్రజలని బైబిలు మనకు తెలియ

జేయుచున్నది. దేవుని ఎట్లు ఆరాధించా లో ఈ సమరయులకు తెలియజేయు టకు ఒక యాజకుడు వారి మధ్యకు పంపబడినట్లు మనము 2 రాజులు 17:24-41లో చూడగలము. అయినను వారు దేవుని సంతోష పెట్టునట్లు ఆయనవైపు తిరుగలేదు.

## నిర్లక్ష్యము

క్రీ॥పూ॥586లో బబులోను దేశము యూదా దేశమును దండెత్తి విజయము సాధించేవరకు యూదా దేశము స్వతంత్రముగానే యుండెను. బబులోను సామ్రాజ్యము కూలిన తరువాత కోరెషు అనువాడు పారసీక (పర్షియా) దేశమును స్థాపించెను. క్రీ॥పూర్వము 536 ప్రాంతములో, యిదివరకు యూదాదేశస్థులైన యూదులు యెరూషలేము దేవాలయ మును పునర్నిర్మించుటకు యెరు బ్బాబెలు నాయకత్వము వహించెను. అది క్రీ॥పూ॥ 515లో సంపూర్తి యాయెను. దేవాలయనిర్మాణములో సహకరించెదమని సమరయులు ముందుకు వచ్చినా, వారు అపవిత్రులని యూదులు ఎంచి వారిని నిరాకరించిరి. అందువలన యూదులకు, సమరయు లకు మధ్య సాంగత్యము లేకుండా పోయినది.

క్రీ॥పూ॥ 331లో అలెగ్జాండరు చక్రవర్తి ఆ ప్రాంతమును జయించి స్వాధీనము చేసికొనెను. అతడు కూడ అక్కడి ప్రజల నివాసములను అటు యిటు మార్చివేసెను. తదుపరి రోమా దేశ చక్రవర్తి కైసరు ఔగుస్తు ఆ ప్రాంతమునకు హేరోదును రాజుగా నియమించెను. క్రీ॥పూర్వము 37వ సంవత్సరమునాటికి హేరోదు గలిలయ, సమరయ, యూదయ ప్రాంతములను పాలించు చుండెను. అతడు సమరయ పట్టణమును తిరిగి నిర్మించి దానికి సెబుస్టె అని నామకరణము చేసెను. ఈనాడు అది సెబాస్తియ అని పిలువబడుచున్నది.

యెర్దాను నదికి పశ్చిమంగా యున్న నబ్యులస్ అను ప్రాంతములో సమరయులలో కొద్దిమంది నేటికిని

యున్నారు.

యేసుప్రభువు జీవించు కాలములో కొందరు సమరయులు గెరిజీము కొండమీద దేవుని ఆరాధించేవారు. అప్పటికిని వారికి యూదులంటే కిట్టదు. మరియు సమరయకు ఉత్తరమైన గలిలయలోని యూదులు, దక్షిణమైన యూదాలోని యూదులు సమరయులను ద్వేషించే వారు, ఉత్తరముననున్న యూదులు యెరూషలేముకు వెళ్లుటకు సమరయ చుట్టూ తిరుగుచు పెరెయగుండా చేరుకొనేవారు. యూదులు ఎవరినైనా సమరయుడవు అని పిలిస్తే అదొక ఘోర అవమానమే. అట్టివాడు దయ్యము పట్టినవానిగా వారు కించపరచే వారు.

మొదట్లో యేసు తన అపొస్తులు లను సమరయుల యొద్దకు, అన్యజనుల యొద్దకు గాక యూదుల యొద్దకే సువార్త ప్రకటించుటకు పంపారు (మత్తయి 10:5,6). వారు సమరయులకు బోధించుటకు ఇంకా సమయమురాలేదు, గాని సమరయు లకు, నిజానికి సమస్త జనుల యెడల యున్న దేవుని ప్రేమను పాత నిబంధన లోని ప్రవచనములు వ్యక్తపరచు చున్నవి (ఆది.కా. 12:3; కీర్తన 22: 27 మొ॥నవి). క్రొత్త నిబంధన కూడ దానినే బోధించుచున్నది (రోమా 1:16). యేసు సమరయులతో సంభాషించుట, వారిని సమానముగా ఎంచుటలో ఈప్రేమ మరింతగా ప్రస్ఫుటమగుచున్నది (లూకా 9:51-56; 17:11-19; యోహాను 4:4 -42). ఆయన మంచి సమరయుని గూర్చి చెప్పిన ఉపమానములో వారిలో యున్న మంచిని గూర్చి బోధించారు (లూకా 10:10-37). తదుపరి సంఘము స్థాపించబడిన తరువాత ఫిలిప్పును, అపొస్తులులును సమరయు లకు సువార్తను బోధించిరి (అపొ.కా. 8:5-25). సమస్త జనులకు సువార్త ప్రకటించుడియని యేసు చెప్పిన దానిని వారు నెరవేర్చారు (మార్కు 16:15; అపొ.కా. 1:8).

-జె.యల్.లెఫెం

# పరిశుద్ధులతో కలిసి ఆరాధించుటలో ఆశీర్వాదములు

పరిశుద్ధులతో కలిసి ఆరాధించుటలో యున్న ఆశీర్వాదములను గుర్తించకపోవుట వలన కొందరు ఆరాధన నిర్లక్ష్యము చేస్తారు. సంఘ సభ్యులతో కలసి ఆరాధించాలనేది దేవుని ఆజ్ఞయే. దాని ప్రయోజనమును ఆయన ఎరిగియుండి, "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా అలాగు చేయుచు ప్రేమచూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" అని మనకు హెచ్చరిక చేయించారు (హెబ్రీ 10:24,25).

సంఘముతో కూడి ఆరాధించుట వలన ఆరాధించే వానికి గొప్ప ప్రయోజనము కలుగును. నిజానికి జీవితంలో దీనితో పోల్చబడే అనుభూతి మరియొకటి లేదు. ఈ ప్రయోజనము లేమిటో ఇప్పుడు గమనించుదాం:

## సహవాసము

సహవాసమనగా కలసి మెలసి యుండుట, పంచుకొనుట, సంబంధము కలిగి యుండుట అనే భావమున్నది. సంఘము, యదార్థమైన ఆరాధన, ఒక పటిష్టమైన సహవాస సంబంధమును ఏర్పరచును (అపో.కా. 2:47; 1 యోహాను 1:7). ఈ సహవాసము సుఖ దు:ఖసమయాలలో గొప్ప ఆశీర్వాద కరముగా యుండును నమ్మకమైన క్రైస్తవుడు తన సాధక బాధకాల్లో తనకు సహాయకరముగా యుండు మిగతా క్రైస్తవులున్నారని ఎరిగి యుండును. మనం ఒండొరుల దు:ఖాలను, ఒండొరుల భారములను పంచు కొందుము. తరచు ఒండొరుల కొరకు కన్నీరు కూడా కారుస్తాము.

## హెచ్చరిక

సంఘముతో కలసి ఆరాధించుటకు ఇష్టపడేవారు సంఘములో జరిగించు బోధను బట్టి హెచ్చరింప

బడుదురు (అపొ.కా.9:31). మనము కడవరి దినము కొరకు నడుచుచుండగా, ఇతరులతో కలసి ఇరుకు మార్గమున నడుచుకొందుము. సంఘములో జరిగే బోధవలన యిది కలుగును. "కాబట్టి సమాధానమును పరస్పర క్షేమాభివృద్ధిని కలుగజేయు వాటినే ఆసక్తితో అను సరింతము" (రోమా 14:19). క్రమముగా ఆరాధనకు హాజరగుట వలన సహోదరుల నుండి కలుగు ప్రోత్సాహమును మనం అంగీకరింతుము. "నేడు అను సమయముండగానే ప్రతి దినము ఒకనికొకడు బుద్ధి చెప్పుకొనుడి" (హెబ్రీ 13:15).

**ఆరాధనలో ఆనందము**

పరిశుద్ధులతో కలసి ఆరాధించుటలో కలుగు మరియొక ఆశీర్వాదమేమంటే, ఆరాధనలో కలుగు ఆనందము (అపొ.కా.2:42. 20:7). పరలోకములో దేవుని ఆనందముతో ఆరాధించుటకు సిద్ధపడాలంటే, ఇప్పుడు దేవుని మనం ముఖ్యముగా ఎంచుకోవాలి. ఇప్పుడు పరిశుద్ధులతో కలసి ఆరాధించుట, పరలోకములో దేవుని సముఖములో యుండి ఆయనను ఆరాధించుటకు సూచనగా యున్నది. ప్రకటన గ్రంథములో ఈ సందర్భముగా ప్రత్యేకముగా మనకు చిత్రీకరించబడినది. "ఆయన సన్నిధిలో సంపూర్ణ సంతోషము కలదు" (కీర్తన 16:11).

**ప్రోత్సాహము**

పరిశుద్ధులతో కలసి ఆరాధించుటలో మనకు గొప్ప ప్రోత్సాహము కలుగును. ఒకరినొకరు పురికొల్పాలని, ప్రోత్సాహించాలని మనకు చెప్పబడి యున్నది (హెబ్రీ 10:24,25). సరియైన కారణమేమియు లేకుండా తరచు మనం ఆరాధనకు గైరుహాజరగుచున్నట్లయితే, క్రైస్తవ పందెములో యున్న మిగతావారిని మనం నిరుత్సాహ పరచుచున్నాము. నిరుత్సాహము అపవాది ఉపయోగించే

శక్తివంతమైన ఆయుధము. క్రైస్తవ జీవితాన్ని మనం జీవించలేము, దాన్ని జీవించితే కలిగే లాభంయేమి లేదని అపవాది మనలను నిరుత్సాహ పరుస్తాడు.

### ముగింపు

వాక్యజ్ఞానము గలవాడు విడువక ఆరాధనకు హాజరగును. దప్పి గొని నీటిబుగ్గ యొద్దకు వెళ్లునట్లు అతడు వెళ్లును. ఈ జీవితాంతమున దేవునితో నిత్యము గడుపు సమయము కొరకు ఆరాధనను అతడు వినియోగించును, ఆరాధనకు క్రమముగా హాజరగుటలో పాపము యొక్క పర్యవసనాన్ని, దాని నుండి రక్షణ పొందే విధానాన్ని మనం తెలిసి కొంటాము. ఈపాపపు లోకంలో మనం యాత్రికులము మాత్రమే. దేవుని నిత్యము ఆరాధిస్తూ, సంఘముతో కలిసి ఆరాధిస్తు మనము నిత్యము గమ్యమునకు చేరుకొందుము గాక!

– డగ్లస్ హేరిస్

## సత్యమును గూర్చి మానవుని భక్తిగల శ్రద్ధ

“నీతిని బట్టి యెవడును సాక్ష్యము పలుకడు; సత్యమును బట్టి యెవవడును వ్యాజ్యెమాడడు” అని యెషయా వ్రాసాడు (యెషయా 59:4). సత్యమును గూర్చి యెవడును పెద్దగా పట్టించుకొనని దినములను గూర్చి అతడు అట్లు వ్రాసాడనుట విధితము. 1రాజులు 22వ అధ్యాయములో యున్న సందర్భమును అతడు వివరించుచుండవచ్చును. ఇశ్రాయేలీయుల రాజైన ఆహాబు, యూదా రాజైన యెహోషాపాతు యిద్దరు కలసి రామోత్గిలాదు పై దండెత్తుటకు సంకల్పించిరి. అది సిరియాలో యుండెను.

యెహోషాపాతు దేవుని యొద్ద విచారణ చేయుదమని చెప్పగా, ఇశ్రాయేలు రాజు దాదాపు 400 మంది ప్రవక్తలను పిలిపించెను. వారందరు తనకు అనుకూలముగా

చెప్పువారే. గనుక రాజైన యెహోషాపాతు "విచారణ చేయుటకై వీరు తప్ప యెహోవా ప్రవక్తలలో ఒక్కడైనను తేడా?" యని అడిగెను (1రాజులు 22: 7). అందుకు ఇశ్రాయేలు రాజు "మీకాయా అను ఒకడున్నాడు. అతని ద్వారా మనము విచారణ చేయ వచ్చును గాని అతడు నన్ను గూర్చి మేలు ప్రకటింపక కీడు ప్రకటించును" అనెను. తదుపరి మీకాయా పిలువ బడెను. ముందు పిలువబడిన ప్రవక్త లందరు రాజుకు అనుకూలముగా ప్రవచించి రామోత్గిలాదును నిశ్చయ ముగా జయింతురని చెప్పిరి. మీకాయను పిలుచుటకు పంపినవాడు అతనితో ప్రవక్తలందరు రాజుకు అనుకూలము గా ప్రవచించు చున్నారు గనుక నీవును అట్లే చెప్పుమని సలహా యిచ్చెను.

అందుకు మీకాయా "యెహోవా నాకు సెలవిచ్చినదేదో ఆయన జీవము తోడు నేను దానినే పలుకుదుననెను" (1రాజులు 22:14). సత్యము కొరకై నిబద్ధత కలిగిన మనుష్యుడితడు. ఆహాబు యేమి వినగోరెనో అది అతని కక్కరలేదు. 400 మంది యేమి చెప్పిరో అది అతనికక్కరలేదు. మీకాయా సత్యమునకు అంకితమై యున్నాడు! సత్యమునే చెప్పాడు.

సత్యమును చెప్పినందువలన మీకాయహాకు కలిగిన ఫలితం యేమిటి? అతని ముఖము మీద కొట్టారు, చెరసాలలో వేసారు. రొట్టె నీళ్లు తప్ప అతనికి ఆహారమేమియు ఇయ్యలేదు. యదార్థముగా ప్రవర్తించు వానికి సాధారణంగా బహుమానం లభించదు ఈ లోకంలో.

"సత్యమును అమ్మివేయక దాని కొని యుంచుకొనుమని" సొలొమోను చెప్పాడు (సామె 23:23). మీకాయా సత్యమును అమ్మివేయలేదు. అందరి వలె అతడును అబద్ధ ప్రవచనం చెబితే అతనికి క్షేమమే కలిగి యుండేది. గాని అతడు సత్యమునకు అంకితుడై యున్నాడు.

మీకాయా ఉదాహరణ వలన మనము సత్యమునకు ఎల్లవేళలా కట్టుబడి యుందాము. ప్రభువు యేమి

చెబితే దానినే మనం చెబుదాము. దానినే మనము విశ్వసించుదాము, బోధించుదాము, జీవించుదాము. సత్యము మాత్రమే మనలను స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32).

అహాబు యుద్ధమునకు వెళ్లితే ఓడిపోతాడని మీకాయా చెప్పాడు. రామోల్గిలాదుకు వెళ్లితే నాశనమై పోతాడని చెప్పాడు. అహాబు అతనిని లక్ష్యపెట్టక మారువేషముతో యుద్ధమునకు వెళ్లాడు. అయితే దేవుని బాణము అతని కవచపు కీలుమధ్యన చొచ్చి అతని ప్రాణము తీసెను. దేవుని వాక్యమే నిలిచెను. అదిఎల్లప్పుడు నిలుచును.

క్రైస్తవుల వలె మనము సత్యమును నిలబెట్టుదాం. దానిని తెలిసికొని, విశ్వసించి, జీవించుదాం.

-క్లేరెన్స్‌డిలోచ్

## దేవుడు లేకుండా సంతోషమా?

"ఆయన సెలవులేకుండా భోజనము చేసి సంతోషించుట ఎవరికి సాధ్యము?" (ప్రసంగి 2:21). నిజమే మనుష్యులు తృప్తిగా తిని సంతోషిస్తారు. నేటి మానవులు ధనవృద్ధి వలన విలాసములను వెదుకుచున్నారు. అయితే ఇక్కడ సొలొమోను చెప్పేది యేమిటి?

మొదటిగా దేవుడు లేకుండా నిజమైన సంతోషము సాధ్యము కాదు. మధ్యపానములో నిజమైన సంతోషమున్నదని కొందరు తలంచినను, నిజానికి అట్టి తలంపులు వ్యర్థమైనవి. ఎందువలన? అట్టివారు తన స్వయం కృషివలననే సంతోషించు చున్నారని తలంతురు. గనుక కృతజ్ఞత అక్కడ లేదు. దేవుడు నీతిమంతులకును అనీతి మంతులకును తన ఆశీర్వాదములను పంపకపోతే సంతోషం అంటూ యేమీ వుండదు (మత్తయి 5:44).

రెండవదిగా మన దీవెనలలో దేవుని హస్తమున్నదని గమనించితే ఒకని సంతోషము అధికమగును. సంతోషముగా యుండాలంటే మనం

పెద్ద భవనములలో జీవించనవసరం లేదు, ఖరీదైన కారును కలిగి యుండ నవుసరంలేదు, ఖరీదైన దుస్తులను ధరించనవుసరం లేదు. "కాగా అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొంది యుందము" అని అపొ. పౌలు వ్రాసాడు (1 తిమోతి 6:8). "నేనే స్థితిలో యున్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగి యుండ నేర్చుకొని యున్నాను. నన్ను బలవరచువాని యందే సమస్తమును చేయగలను" అని అతడు చెప్పాడు (ఫిలిప్పీ 4:12-13). విస్తారమై ‌పదతో దీవించబడిన సొలొమోను ఒకనికి కావలసిన వన్నియు పొందిన తరువాత, వాటికై అతడు చేసిన ప్రయాసమంతయు వ్యర్థమైనదిగాను ఒకడు గాలికి ప్రయాసపడినట్టుగాను అతని కనిపించెను (ప్రసంగి 2:1-11). ఎందువలన? చిరకాలము నిలుచు సంతోషము ఈలోక విలాసములలో లేదు.

ఒకని జీవితంలో దేవుని కలిగి యుంటే అతడు సమస్త జ్ఞానమునకు మించిన సమాధానము కలిగి యుండును (ఫిలిప్పీ 4:6). తద్వారా దేవుని ఆశీర్వాదములను అనుభవించే తరుణము కలిగిన వాడగును. గనుక మన ప్రశ్నకు జవాబేమిటి? దేవుడు లేకుండా ఒకడు నిజముగా సంతోషించ గలడా? ఉండలేడు. అది నిజ సంతోషము కాదు. మనము జీవితంలో దేవుని కలిగి ఉన్నపుడే యదార్థమైన వాడబారని సంతోషము కలిగి యుండగలము.

-డెన్నీ పెట్రిలో


**ఉచిత బైబిలు కోర్సు**

**మీ యింటిలోనే ఉండి బైబిలు సత్యములను తెలిసికొనండి. మేమిచ్చు బైబిలు కోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ పాఠములను ఉచితంగానే పొంది దానిని పూర్తిచేయగానే ఒక బైబిలు గ్రంధమును ఉచితముగా పొందండి. దిగువ అడ్రసుకు నేడే వ్రాయండి.**

**సత్యవాణి**

పోస్ట్ బాక్స్ నెం. 80,

కాకినాడ - 533 001.

ఫోన్ : 0884 - 2363722

# సంక్షిప్తవార్తలు

2021 జూన్ నెల అంతయు కరోనా సంబంధమైన లాక్‌డౌన్ వలన ప్రజాజీవనము అస్తవ్యస్తమైనది. దాని యొక్క తీవ్రత వలన సత్యవాణి ఆఫీసు కూడా పదిరోజులమట్టుకు మూసివేయబడెను. అయితే స్థానిక క్రీస్తు సంఘము మాత్రము సమాజముగా కూడుట ఎన్నడు నిర్లక్ష్యము చేయలేదు. 2021 మే – జూన్ నెలలో సత్యవాణి క్రీస్తు సంఘ సభ్యులు అయిదుగురు కరోనావైరస్ బారినపడి ప్రాణములు కోల్పోయారు. వారిలో ముగ్గురు వివాహితులైన యువకులు. అందులో ఒకనికి ముగ్గురు చిన్నపిల్లలు కూడా యున్నారు. వితంతువులైన యువతుల కొరకు ప్రార్థించమనవి.

కాకినాడ పరిసరప్రాంతములలో క్రీస్తుసంఘములలో కరోనా బారిన పడి ఆక్సిజన్ అవుసరం అనుకొనేవారు సత్యవాణి ఆఫీసుకు ఫోన్‌చేసిన యెడల ఆక్సిజన్ పరికరములను కొన్నిరోజుల మట్టుకు అందించగలము.

2021 జూలై సంచికతో సత్యవాక్కు ప్రచురించుట మొదలిడి 42 సంవత్సరములు ముగిసెను. ఆగష్టు నెలలో యిది 43వ సంవత్సరములో ప్రవేశించును. లాక్‌డౌన్ నిబంధనల వలన అనేక మాసపత్రికలు, ప్రచురణలు మూతవేయబడినను సత్యవాక్కు మాత్రము ఎన్నడు ప్రచురణ ఆపలేదు. ప్రతి నెలా సకాలానికి ఈ పత్రిక కాకినాడ హెడ్‌పోస్టాఫీసులో అందించబడుచున్నది. ప్రతినెలా ఇంచుమించు 10,500 కాపీలు ముద్రించబడుచున్నవి. అనగా ప్రతినెలా ఈ పత్రిక అన్ని యిండ్లకు సత్యవాక్కును ముద్రిత రూపమున అందజేయుచున్నది. ఇందుకు దేవునికి స్తోత్రము. ఎవరికైనా ఈ పత్రిక రెండు మూడు కాపీలు అందుచున్న యెడల సత్యవాణి ఆఫీసుకు వెంటనే తెలియజేయ మనవి.

బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో కూడా వేలకొలది ప్రజలు చేరి ఒక బైబిలును ఉచితముగానే పొందుచున్నారు. కరోనావలన బహిరంగ సభలు వగయిరా నిషేదించబడినను, బైబిలు కోర్సుల ద్వారా లక్షలాది ప్రజలు సత్యమునుచదివి గ్రహించుకొనుచున్నారు.

అమెరికాలో రిక్కీగూటం గారి కుటుంబము, రోనీగూటం గారి కుటుంబము సువార్తపనిలో నిమగ్నులై యుండుటయే గాక భారతదేశములో జరుగుచున్న పనిని గూర్చి అక్కడ వారికి తెలియజేయుచున్నారు. రోనీ గారి భార్య హరిత గూటం గారు గర్భవతియై యున్నందున రిక్కీ గారు, జస్టిన్ గూటం గారు జూలై మొదటి వారములో ఇండియాకు తిరిగిచేరుకొందురు. ఆగష్టు నెలలో హరిత గారి ప్రసవం అనంతరం సుదీపగూటం గారు, రోజలిన్ గూటం గారు భారత్‌కు తిరిగి చేరుకొందురు. వీరందరికి కొరకు ప్రార్థించ మనవి.


**RNI Regd. No. 69973/98**

**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**

పోస్టుబాక్సు - 80

కాకినాడ - 533001

ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతీ నెల 9వ తేదీ

పోస్టు చేయు తేదీ : ప్రతీ నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004